


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### వీళ్ళనేం చేద్దాం?

**చిన్నప్పుడు** సంగతులన్నీ నెమరువేసుకోడానికి నాస్టాల్జియాగా మిగిలిపోతాయని మనకి అప్పుడు తెలీదు. ఇప్పుడు మా భవానీ వాళ్ళింట్లో మంచం అడ్డం పెట్టి, సినిమాలన్నీ ఆడేవాళ్ళం' అనీ, 'ఇవటూరి వాళ్ళింట్లో బొమ్మల పెళ్ళిళ్ళు చేసేవాళ్ళం అనీ,' 'సీతారామ్మూర్తిగారింట్లో శ్రీరామనవమి ముందు సీతమ్మని పెళ్ళికూతుర్ని చేసేవాళ్ళం అనీ మా కాలనీవాళ్ళు ఎవరం కలుసుకున్నా చెప్పుకుని మురిసిపోతాం. అందుకే అన్నారు 'We don't know when we make a memory' అని.

అసలు ముక్కు కారుతుంటే, ఎగబీలుస్తూ చెడ్డీ జారిపోతుంటే, పైకి లాక్కుంటూ కనిపించే ఓ సాధారణ బాలుడు సందానీ గురించి నేను పెద్దయాక పుంఖానుపుంఖాలు రాస్తానని వాడూ అనుకోలేదు. నేనూ అనుకోలేదు. వాడు చరిత్రకెక్కుతున్నాడు.

మా కాలంలో ఇళ్ళల్లో బొచ్చుకుక్క పిల్లల్ని గొప్పవాళ్ళే పెంచుకుంటారని మా సందానీ చెప్పే వాడు. "ఏవీ రమణీ వాటికీ వేరే సబ్బు, వేరే తిండి, ఇంజెషన్లు.. అసలు ఆస్పటలే వేరు. మాకీ ఇంట్లో ముగ్గురు పిల్లలు తింటయి, దానికయ్యే నెల ఖర్చుతో" అని ఓసారి మార్వాడీ వాళ్ళింట్లో టీ.వీ చూడ్డానికి వెళ్ళినప్పుడు చెప్పాడు.

"దాని పేరేంటీ?" కుతూహలంగా అడిగాను."

"జూలీ" అన్నాడు.

"అదేవిటీ వీళ్ళు హిందువులు కదా?" అన్నాను సేఠ్ గారింట్లో పెద్ద లక్ష్మీదేవి పటాన్ని చూస్తూ, సందానీ కిచకిచా నవ్వి "మీకీ ఇంట్లో కుక్కని పెంచితే, అవి బాపన్ కుక్క అయిపోతాయా?" అన్నాడు.

"మరి జూలీ ఏవిటి? ఏ లక్ష్మో, గోపాలో పెట్టక అన్నాను" ఎందుకంటే, మా పెద్దనాన్నగారింట్లో రామూ అనే కుక్క వుండేది.

సందానీకి విసుగొచ్చినట్లు చూసి "నీకేమీ తెల్వద్.. అది మన దేశంది కాదు. ఫారెన్ కుక్క" అన్నాడు.

నేను ఆశ్చర్యంగా చూసాను. అప్పట్లో సినిమాల్లో కూడా ఆవుని చూపిస్తే గోవిందుడనీ, శరత్ నవలల్లో చివరికి చేపని పెంచి గణేశుడనీ, చిన్నప్ప దేవర్ గారి సినిమాల్లో జంతువులని చూపిస్తే, పొట్టేలు రామూ, ఏనుగుకి లక్ష్మణ్ ఇలాంటి పేర్లుండేవి. ఉన్నంతలో స్టైలుగా పెట్టేవారు. ఎల్లమ్మ, ఎంకయ్య, పుల్లయ్య అని పెట్టేవారు కాదు. మా సందానీ మేకపిల్లకి చాందినీ అనీ, అప్పుడప్పుడొచ్చి కరిచిపోయే కుక్కపిల్లకి బిజిలీ అని పేరు పెట్టాడు.

మా అమ్మ 'మాయదారి పిల్లి' అని తిట్టే నల్లపిల్లికి 'దొంగకృష్ణుడు' అని నేనూ పేరు పెట్టుకున్నాను. కానీ ఫారెన్ కుక్కలకి తెలుగు పేర్లు పెట్టకూడదని అప్పుడే తెలుసుకున్నాను.

ఇంక ఇప్పుడైతే భారతీయ కుక్కలని అసలు ఇళ్ళల్లోకే రానివ్వడం లేదు. అన్నీ విదేశీ సంతానమే. లాంబ్రేడర్, సైంట్ బెర్నాడ్, పమేరియన్, పగ్ ఇవే నాకు తెలుసు కానీ మా పిల్లలకి గ్రేట్ డాన్, నెపోలిటా, స్కాటిష్ డియర్ హౌండ్, ఇంగ్లీష్ మేస్టిఫ్ ఇవన్నీ కూడా తెలుసు. ఇంక వాటి జాతికి సంబంధించినట్లే వాటికి అర్నాల్డ్, మెజెన్షియా, శామ్సన్, డిలైలా అని పిల్లల పేర్లు కన్నా ఎక్కువ శోధించి పేర్లు పెడ్తున్నారు. పైగా వాటికి భాషా కన్ఫ్యూజన్ లేకుండా అందరూ ఇంగ్లీషులో మాట్లాడ్తారు. ఓసారి మా అమ్మమ్మతో పెద్దనాన్నగారింట్లో కుక్క ఎలా వుంది? అని అడిగితే "నేను మాట్లాడలేదు. ఇంగ్లీషులోనే మాట్లాడాలిట" అంది.

అసలు చదువురాని సందానీ తల్లికూడా, మార్వాడీ వాళ్ళింట్లో కుక్కని 'సిట్టూ, స్టాండూ కమ్మూ....గో" అనేది పాపం.

మొన్నేదో స్టాండప్ కామెడీ షోలో ఆ పిల్లాడు చెప్పాడు. అసలు మన దేశంలో విదేశీ సంస్కృతి ఎంతగా పెరిగిపోయిందంటే, చివరకి మన భారతీయ సంతతికి చెందిన కుక్కలు కూడా మనకి పనికి రాకుండా పోయాయి. అందుకే రామూలూ, గోపీలూ బదులు బెర్నార్డ్‌లూ, జూలీలూ పుట్టుకొచ్చాయి. అవి అరవవట. కానీ కరుస్తాయి. మన ఇళ్ళ చుట్టూ తిరుగుతూ తోక ఆడిస్తూ, ఇంత అన్నం పడేస్తే తిని విశ్వాసంగా, ఏ దొంగో గోడ దూకబోతే, చెట్టుకింద చలిలో పడుకుని కూడా దుప్పటి బిగించి పడుకున్న మనకి వినపడేట్లు 'భౌ...భౌ'మని అరిచే పెట్రోలింగ్ డాగ్స్‌ని ఘూర్కాలతో వెళ్ళగొట్టిస్తున్నారు. గడ్డపలుగులు, రాడ్లు పట్టుకుని ఇంట్లో కొస్తే సోఫా కిందో, మంచం కిందో దూరే ఈ విదేశీ కుక్కలు మనకి అవసరమా! ఇళ్ళల్లో పెంచుకున్న జూలీలకీ, సోనీలకీ బాత్‌టబ్‌లో విదేశీ సబ్బులతో స్నానాలూ, అక్కడినుండి దిగుమతి అయ్యే ఆహారాలూ. అది స్పాగెట్టీనే తింటుంది. పీచ్ కానీ స్ట్రాబెర్రీకానీ తింటుంది' అని చెప్పి మురిసిపోడం.

ఇంక వీధి కుక్కలు ఎక్కువైపోయాయి. చెత్తకుప్పల్లో వదిలేసిన పిల్లల్ని పీక్కుతింటున్నాయి. పిచ్చెక్కి తన్నుకుంటున్నాయి. బల్దియా సిబ్బంది ఏం చేస్తున్నారు? ఇలా జరగడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణం అని పేపర్లో వార్తలు.

అసలు ఈ కుక్కలన్నీ ఎక్కడ్నించి వస్తున్నాయి? ఒకప్పుడు ఇళ్ళల్లో ప్రేమగా చేరదీసి పెంచుకున్న రామూలూ, గోవిందులూ వాళ్ళ పిల్లలు. వాళ్ళకి తిండిలేక, ఫ్యామిలీ ప్లానింగ్ లేక రోగం వస్తే పట్టించుకునే వాడు లేక, మజ్నూలై లైలా కోసం వీధుల వెంటపడి, లైలా చుట్టూ తిరుగుతుంటే రాళ్ళతో కొడతారు. వాటికి పిచ్చెక్కి పిల్లల్ని పీక్కు తింటున్నాయట. అసలు చెత్త కుండీల్లో పిల్లల్ని కని వేసేసే వాళ్ళని వదిలేసి, బల్దియా సిబ్బంది కుక్కలని పట్టుకుపోయి శిక్షిస్తాయి. ఆ పిల్లల్ని మాత్రం ఎక్కడ ఉత్పత్తి అయి వస్తున్నారు ? అని పట్టించుకునే వాళ్ళు లేరు. ఎందుకంటే మునిసిపాలిటీ సిబ్బందికి టీ బ్రేకులూ, సిగరెట్ బ్రేకులూ అయ్యేటప్పటికి ఆఫీసవర్స్ అయిపోయి, ఫైళ్ళు కట్టేసి, ఇళ్ళకి వెళ్ళిపోతారు. ఇంక పోలీసు సిబ్బందికి దొంగల్నీ, హంతకుల్నీ పట్టుకోవడం కాకుండా, పోలీసు స్టేషన్‌లో పెళ్ళిళ్ళు చెయ్యడం, మొగుడు కొట్టాడని వచ్చే కేసులూ, పక్కింటివాడు మా వాటర్ పైప్‌కి కన్నం పెట్టి నీళ్ళు కాజేస్తున్నాడనే కేసులూ ఎక్కువైపోయాయి.

ఈ బోరు బావుల దగ్గర పసిపిల్లల్ని వదిలేసి, పడేదాకా పట్టించుకోని తల్లుల్నీ, కని చెత్తకుండీల్లో వదిలేసే తల్లితండ్రుల్నీ వాళ్ళు వెదకలేరు. అసలు ఈ మధ్య పోలీసులకి ఈ సెల్‌ఫోన్లూ, ఫేస్‌బుక్‌లూ వచ్చాక పని తక్కువైపోయింది. "వాడు ఎన్నిగంటలకి మర్డర్ అయ్యాడూ? కాల్ రికార్డ్ చూడండి. ఎన్నిగంటలకి చివరిర్ కాల్ చేసాడు? చివరి మెసేజ్ ఎవడికి పెట్టాడు? వాడెవడు? లేదా ఆమె ఎవరు? పట్టండి. కేసు క్లోజ్. హంతకులు దొరికారు. అంత సింపుల్ అయిపోయింది.

"వాడు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడ్డాడు" ఏం చెయ్యాలి? వాడ్ని లోపల వెయ్యడమా? కారులోపలెయ్యడమా? వాడికైతే ఫుడ్ పెట్టాలి. నీళ్ళియ్యాలి. అయితే కారు లోపలేద్దాం. వీడికి శిక్షణ ఇద్దాం. అంటే తెల్లారి క్లాసు పీకి కోర్టుకి పంపిద్దాం. డబ్బులు కట్టించుకుని వదిలేస్తారు. అదీ పద్ధతి. శిక్ష కన్నా శిక్షణ దారుణం అని చిన్నప్పటినుండీ నాకూ మా సందానీకీ బాగా తెలుసు.

ఏ జామ చెట్టెక్కుతూనో, మేకపాలు పితుకుతూనో మా డేవిడ్ సార్‌కి కనిపిస్తే "ఏసు మిమ్మల్ని క్షమించడురా... మీరు మంచి గొర్రెలవలె బ్రతకవలె" అనేవాడు. అసలు నన్నెందుకు క్షమించడు? ఆయన చెట్టా ఇది? అని మా సందానీకి చచ్చేంత కోపం వచ్చేది. సువార్త పద్నాలుగో అధ్యాయంలో పేతురు ఏమి పలికినాడంటే " అని క్రీస్తుమణి టీచర్ చెప్తుంటే "అసలు ఎందుకు పలికాడు? ఎవరు అడిగారు? ఇంకేం పనిలేదా? పైగా ఇన్ని ,వందల పేజీలు పలకాలా? అవి మేం క్లాసుకి మోసుకు రాలేక చేతులు పడిపోతున్నాయి" అని లేచి నిలబడి అడిగాడోసారి. తర్వాత టీచర్ రోజంతా గోడకుర్చీ వేయిస్తే కొన్నాళ్ళు `కుర్చీ`లాగే నడుస్తూ కనిపించేవాడు. ఇప్పుడు చెప్పండి శిక్షకీ శిక్షణకీ ఏవిటి తేడా? దెబ్బ అయితే కాసేపటిలో పోతుంది. కానీ నీతులు క్లాసులు పీకుతుంటే వినడం, విన్నాక పాటించలేకపోవడం చాలా పెద్ద శిక్ష. అసలు ఈ ఏసుకి బాల్యం లేదా? మన రాముడిలా చందమామ కావాలని పేచీలు పెట్టలేదా? కృష్ణుడిలా గోడలు దూకలేదా? ఎవరైనా చిన్నప్పుడు ఇలాగే చేస్తారు కదా అని సందానీ మీటింగులు పెట్టేవాడు. "వినోలియా చెంపలు వేసుకుని పరలోకంలో నిన్ను శిక్షిస్తారు. ఇలా మాట్లాడకురా" అనేది.

"సరే ఈ లోకంలో ఫుడ్ సంగతి ఏంటి? జామకాయలు మాకు ఫుడ్ నాకూ నా తమ్ముడికీ, చెల్లెలికీ మాకీ అమ్మీజాన్ అన్నం చెయ్యలే. ఏం తినమంటయ్ చెప్పు?" అనేవాడు. గొప్ప కార్లమార్క్స్‌లా. కర్మ సిద్ధాంతాన్ని నమ్మేవాడు వాడు.

మన చిన్న రొట్టెముక్క వేస్తే తోక వూపి, మన ఇళ్ళకి కాపలా కాసే ఊరకుక్కలని బల్దియాలకి పట్టించి, ఇళ్ళల్లోకి రాడ్స్, గడ్డపలుగులతో వచ్చే దొంగలని చూసి మంచం కింద సోఫాలూ అవసరమా? పైగా వాటికి నెలకోసారి పెట్ క్లినిక్కులూ, ఎపాయింట్‌మెంట్లూ, ఫారెన్ ఫుడ్లూ, స్పెషల్ సోప్స్, పడుకోడానికి బెడ్స్, కొందరైతే క్రాసింగ్స్, శ్రీమంతాలూ, బేబీ షవర్స్‌కి కూడా ఆహ్వానాలు పంపి పిలుస్తున్నారంట. మరి ఫుడ్ మనుషులది పెడ్తారో దానిది పెడ్తారో మరి?


గరికపాటి వారు చెప్పారు. రోజుల పసివాడ్ని క్రష్‌లో పెట్టి, కుక్కపిల్లకి నాలుగుగంటలు స్నానం చేయించే తల్లులు తెల్సని.

డబ్బు ఎక్కువై వచ్చిన పిచ్చిలా అవి? ఇంక విదేశాల్లో అయితే వాటిని ఎవరైనా కిడ్‌నాప్ చెయ్యడం, రాన్‌సమ్ అడగడం. ఆ సదరు ఓనర్స్ మిలియన్స్ కూడా ఇచ్చి వెనక్కి తెచ్చుకోవడం జరిగాయుట. నేనెళ్ళినప్పుడు పిల్లి పిల్ల ఫోటోలు పెట్టి `మిస్సింగ్` అన్న పోస్టర్స్ అంటించి వుంటేనే తెగ ఆశ్చర్యపోయాను.

అసలు ఈ పగ్‌లనేవి ఎక్కువ బలసిన చుంచెలకల్లా, మరి కొన్ని పెద్ద సైజు ఉడతల్లా ఉంటాయి. ఇవి వీరికి రక్షణ కోసం కాదుకానీ వాటికి మాత్రం ఎవరూ ఎత్తుకుపోకుండా రక్షణ ఏర్పాటు చెయ్యాలి. తమ పిల్లల్ని క్రెచ్‌కి పంపించి, వీటికి ఆయాల్లా మారుతున్న తల్లులున్నారుట.

అసలు సందానీ ఆ రోజుల్లోనే ఎవరైనా పిలిచి క్లాసులు పీకితే "నీకీ నాయనా అడగగానే బట్టలూ, టపాసులూ, బిస్కెట్లూ తెచ్చిస్తాయి కదా! అందుకే నీకీ ఇన్ని నీతులు చెప్తాయి" అని మొహానే కడిగేసేవాడు. వేలకొద్దీ ఎకరాలూ, పెద్ద పెద్ద పదవులు కాజేసిన సాధూమారాజ్‌లూ, మఠాధిపతులూ `నైతికత` గురించి పాఠాలు చెప్తుంటారు మన దేశంలో. సందానీ ఈ పరిస్థితుల్ని చూసి ఏమనేవాడో?

Post your comments




https://www.youtube.com/watch?v=ERaaX_IulS4

